సాక్షి
నంద్యాల
శుక్రవారం । 16 । మే । 2025



పడగ విప్పిన డెంగీ
దోమలు పుడుతున్నాయి.. మనుమలను కుడుతూనే ఉన్నాయి. జిల్లాలో డెంగీ వ్యాధి ప్రబలుతోంది. ఈ నెల 16న జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో▸



ఉచితాన్ని తుంగలో తొక్కి!
ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. తుంగభద్ర నదిలో అందుకు విరుద్ధంగా టీడీపీ నాయకులు ఇసుక దోపిడీ చేస్తున్నారు. 8లో▸



ఆటోను షాపుగా మార్చుకొని..
బేతంచెర్ల: పట్టణానికి చెందిన నాగేంద్ర తన ఆటోను షాపుగా మార్చుకున్నాడు. తన తల్లి ఈరమ్మతో కలిసి గ్రామాలు, పట్టణాలు తిరిగుతూ ఆటోలోనే వ్యాపారం నిర్వహిస్తున్నాడు.

న్యూస్‌రీల్

యాగంటిలో జిల్లా కలెక్టర్ దంపతులు



జిల్లా కలెక్టర్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఈఓ

బనగానపల్లె రూరల్: యాగంటి క్షేత్రంలో శ్రీ ఉమామహేశ్వరస్వామికి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా దంపతులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ ఈఓ చంద్రుడు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని అందజేశారు. యాగంటిపల్లె గ్రామ ఉపసర్పంచ్ బండి మౌలీశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా నివారణకు టోల్‌ఫ్రీ నంబరు 14405



మాట్లాడుతున్న డీఆర్ఓ రామునాయక్

నంద్యాల(న్యూటౌన్): నాటుసారా నివారణకు 14405 టోల్ ఫ్రీ నంబరు ఏర్పాటు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గురువారం నవోదయం 2.0 కార్యక్రమ పటిష్ట అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ.. జిల్లాలో ఇప్పటి వరకు 3,474 లీటర్ల నాటు సారా సీజ్ చేశామన్నారు. ఎక్సైజ్ శాఖ వారి తరఫున 198, పోలీసు సహకారంతో 47 కేసులను నమోదు చేశామన్నారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఈఓ జనార్దన్‌రెడ్డి, డీఎఫ్ఓ నాగమునేశ్వరి పాల్గొన్నారు.

ఏపీ ఈసెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

కర్నూలు సిటీ: ఏపీ ఈసెట్ ఫలితాలను గురువారం అనంతపురం జేఎన్‌టీయూ అధికారులు విడుదల చేశారు. ఫలితాల్లో ఉమ్మడి కర్నూలు జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కర్నూలు జిల్లాలో 1,261 మంది పరీక్షలకు హాజరుకాగా 1,146 మంది ర్యాంకులు పొందారు. నంద్యాల జిల్లాలో 791 మంది హాజరుకాగా 736 మంది ర్యాంకులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజినీరింగ్‌లో ఓర్వకల్లు మండలం కేతవరం గ్రామానికి చెందిన దొమ్మల హేమంత్ రెడ్డి రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించారు. అదే విధంగా డోన్ మండలంలోని రామదుర్గం గ్రామానికి చెందిన అప్పల ప్రణీత్ రెడ్డికి 6వ ర్యాంకు వచ్చింది. బీఎస్సీ ఎంపీసీలో నందికొట్కూరు విద్యా నగర్‌కి చెందిన పెరుమళ్ల రాజేష్ 6వ ర్యాంకు, సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో ఎమ్మిగనూరుకి చెందిన కె.రఘు 6వ ర్యాంకు, ఈఈఈలో ఎమ్మిగనూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన మడుగుల అమర్నాథ్ 7వ ర్యాంకు, బనగానపల్లె గొల్లపేటకు చెందిన జి.శ్రీనివాసులు 10వ ర్యాంకు సాధించారు. ఫార్మసీలో కర్నూలు బుధవారపేట హబీబ్ ముబారక్ నగర్‌కి చెందిన షేక్ ముస్కాన్ 6వ ర్యాంకు, షేక్ తజ్మీన్ 10వ ర్యాంకు సాధించారు.

వేతన.. వేదన!

- ‘ఉపాధి’ సిబ్బందికి మూడు నెలలుగా అందని జీతాలు
- కుటుంబాల పోషణకు ఆపసోపాలు
- రూ. 1.30 కోట్లకు పైగా వేతన బకాయిలు
- జీతాల కోసం 677 మంది ఉద్యోగుల ఎదురు చూపు

ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీనే వేతనాలు ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ప్రచారం చేస్తోంది. అయితే వాస్తవం అందుకు విరుద్ధంగా ఉంది. జీతాలు రాక గ్రామీణ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కుటుంబాలు పస్తులుంటున్నా.. కూలీలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆళ్లగడ్డ: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పర్యవేక్షణలో ఉపాధి హామీ పథకంలో ఏపీఓ, ఈసీ టీఏ, ఎఫ్ఏ, కంప్యూటర్ ఆపరేటర్లు 677 మంది విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా సమన్వయంతో పనులు చేస్తున్నారు. దాదాపు 60 వేల కుటుంబాలకు ఉపాధి పనులు కల్పిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పనులు గుర్తించడం, ప్రతి రోజు కూలీలతో చేయించడం, సకాలంలో వేతనాలు అందిస్తున్నారు. కాంపోనెంట్ పనులకు బిల్లులు చెల్లించడంలో వీరందరి పాత్ర కీలకం. అయితే వీరే సుమారు మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం!
ఉపాధి కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించే బాధ్యతలో అధికారులు, సిబ్బంది కీలక భాగస్వాములు. ఉపాధి పనుల్లో పండ్ల తోటల పెంపకం, సాగునీటి కాల్వలు, చెరువులు, నీటి కుంటలు, డంపింగ్ యార్డ్‌లు, గోకులాల నిర్మాణాలు, నర్సరీల నిర్వహణ ఉంటాయి. ‘ఉపాధి’ కూలీలకు వారవారం వేతనం బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా అధికారులు, సిబ్బంది చూడాలి. అయితే వీరికి సకాలంలో జీతాలు అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తోందన్న విమర్శలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. వచ్చే వేతనాలు తెచ్చిన అప్పులకు వడ్డీలకే సరిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది (ఫైల్)

గుర్తింపు ఏదీ?
ఉపాధి హామీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న వారిని రెండు సంవత్సరాలు దాటితే ఫిక్స్ టెన్యూర్ ఎంప్లాయ్‌గా గుర్తించాలి. అయితే ఏళ్లు గడుస్తున్నా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగానే చాలీచాలని వేతనాలు అందజేస్తున్నారని మండి పడుతున్నారు. లక్ష్యాలు విధిస్తూ పనిభారం పెంచుతున్న ప్రభుత్వం ఫిక్స్ టెన్యూర్ ఎంప్లాయ్‌గా గుర్తించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆవేదన చెందుతున్నారు.

పెండింగ్ బిల్లులు రూ. 100 కోట్లు
జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో చేసిన వివిధ పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు జిల్లాలో సుమారు రూ. 100 కోట్లకు చేరుకున్నాయి. సుమారు ఆరు నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి. ఫలితంగా మొదలు పెట్టిన పనులన్నీ సంపూర్తిగా నిలిచిపోయాయి. 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేసిన పనులకే బిల్లుల రాని కారణంగా కొత్తవి చేపట్టేందుకు వెండర్లు ఎవరూ ముందుకు రావడంలేదు.

మండలాలు - 28 / గ్రామాలు - 438	ఫిక్స్ టెన్యూర్ ఎంప్లాయ్స్	అవుట్ సోర్సింగ్
ఏపీఓలు	28	4
జెఈ (సివిల్)	03	
ఇంజినీరింగ్ కన్సెల్టెంట్	17	
టీ.ఏ	141	20
బేర్ ఫుట్ టెక్నీషియన్		30
జూనియర్ టి.ఏ		1
కంప్యూటర్ ఆపరేటర్		30
ఎఫ్ఏ		403

చెల్లించాల్సిన వేతనం: రూ. 1.50 కోట్లు

చెల్లించాల్సిన మెటీరియల్ కంపోనెంట్ నిధులు: రూ. 100 కోట్లు

అప్పులు చేస్తున్నాం
వేతనాలు సకాలంలో అందకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కుటుంబ అవసరాలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి. ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులకు జాప్యం లేకుండా ప్రతి నెలా జీతాలు చెల్లించాలి.

– వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్

అవస్థలు పడుతున్నాం
మూడు నెలలుగా వేతనం అందడం లేదు. ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయి. కుటుంబ ఖర్చులు కూడా ఎక్కువగా ఉన్నాయి. జీతాల చెల్లింపు ఆలస్యం కావడంతో అవస్థలు పడుతున్నాం. ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉద్యోగులకు వేతనాలు త్వరగా చెల్లించే విధంగా ఉన్నత అధికారులు చొరవ చూపాలి,

– సుబ్రమణ్యం, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ



శ్రీమఠం ప్రాంగణంలో భక్తులు

శ్రీమఠంలో భక్తుల సందడి

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల సందడి నెలకొంది. గురువారం ప్రత్యేకం కావడంతో భక్తులు వేలాదిగా తరలివచ్చారు. తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, రాఘవేంద్రుల మూల బృందావనం దర్శనాలు చేసుకున్నారు. రాఘవేంద్రుల బృందావన దర్శనానికి రెండు గంటలకుపైగా సమయం పట్టింది. భక్తుల రాకతో దర్శన క్యూలైన్లు, అన్నపూర్ణ భోజనశాల, పరిమళప్రసాదం కౌంటర్లు కిటకిటలాడాయి. నిత్య వేడుకల్లో భాగంగా రాయరు ప్రతిమకు ఊంజల మంటపంలో ప్రత్యేక ఆర్జిత సేవలు చేశారు. అనంతరం బంగారు పల్లకీలో రాయరు బృందావన ప్రతిమను రమణీయంగా ఊరేగించారు.



ఊంజల మంటపంలో రాయరుకు ఆర్జిత సేవ

17న కర్నూలుకు సీఎం చంద్రబాబు

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు కర్నూలు పర్యటన ఖరారైంది. కర్నూలు రైతు బజార్‌లో జరిగే స్వచ్ఛంధ్రా-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం ప్రజావేదికలో పీ4 లబ్ధిదారులు, మార్గదర్శకులతో మాట్లాడేందుకు వీలుగా పర్యటనను ఖరారు చేశారు. 17న ఉదయం 11.25 గంటలకు సీఎం ప్రత్యేక విమానంలో కర్నూలు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 11.55 గంటలకు రోడ్డు మార్గంలో కర్నూలు సీక్యాంపు రైతు బజార్‌ను చేరుకొని 12.25 గంటల వరకు స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శానిటరీ వర్కర్లు, రైతులతో మాట్లాడుతారు. 12.35 గంటలకు కేంద్రీయ విద్యాలయం పక్కన ఏర్పాటు చేసే కార్యక్రమంలో స్వచ్ఛంధ్రా -స్వర్ణాంధ్ర పార్కు, 100 అడుగుల రోడ్డుకు భూమి పూజ చేస్తారు. 2 నుంచి 3.30 గంటల వరకు కర్నూలు ప్రజలతో సంభాషిస్తారు.



రుద్రవరంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు

తడిసిన ధాన్యం.. అన్నదాత దైన్యం



పిడుగుపాటుతో మృతిచెందిన మేకలు

నంద్యాల(అర్బన్): జిల్లాలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి పోయి రైతులకు దైన్యమే మిగిలింది. ఆత్మకూరు, కొత్తపల్లి, రుద్రవరం, చాగలమర్రి మండలాల్లో నష్టం ఎక్కువగా ఉంది. అనేక ప్రాంతాల్లో స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. ఆత్మకూరు మండలం కరివేన, నల్లకాల్వ, సిద్ధాపురం, బాపనంతపురం గ్రామాల్లో కల్లాల్లోని ధాన్యం తడిసి పోయింది. కొత్తపల్లి మండలం వీరాపురం, సంగమేశ్వరం, లింగాపురం గ్రామాల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- ➡ చాగలమర్రి మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో గురువారం తెల్లవారుజామున పిడుగుపాటుతో మేకల కాపరి చంద్రశేఖర్ మృతి చెందారు. మూడు మేకలు కూడా మృత్యువాత పడ్డాయి.
- ➡ రుద్రవరం మండలంలో రోడ్లు జలమయమయ్యాయి. గ్రామాల్లో అక్కడక్కడ చెట్లు విరిగి రహదారులకు అడ్డంగా పడటంతో రాకపోకలు నిలిచిపోయాయి. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి పోవడంతో వాటిని దాచేందుకు రైతులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.
- ➡ డోన్, గడివేముల, మహానంది, పాములపాడు, కొలిమిగుండ్ల, బేతంచెర్ల అవుకు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిశాయి.

వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీ)
ఆత్మకూరు	51.4
రుద్రవరం	50.8
కొత్తపల్లి	50.4
డోన్	26.8
గడివేముల	22.2
దొర్నిపాడు	20.4
మహానంది	19.2
పాములపాడు	17.4
కోవెలకుంట్ల/బేతంచెర్ల	16.6
అవుకు	15.2
గోస్పాడు	13.2
ప్యాపిలి	13.0
వెలుగోడు	10.6
పాణ్యం	10.0

‘సిల్వర్‌జూబ్లీ’లో వంద శాతం ఫలితాలు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ సిల్వర్‌జూబ్లీ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ 6వ సెమిస్టర్ ఫలితాలను గురువారం ఆ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు విడుదల చేశారు. మొత్తం 216 మంది విద్యార్థులు పరీక్షలు హాజరుకాగా 216 మంది ఉత్తీర్ణులు అయ్యారన్నారని పరీక్షల విభాగం డీన్ డాక్టర్ కె నాగరాజు శెట్టి తెలిపారు. ఆ తరువాత రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. సిల్వర్ జూబ్లీ కాలేజీ అంటే ఓ బ్రాండ్ అని, ఇక్కడ చదివిన వారందరు గొప్ప స్థానాల్లో ఉన్నారన్నారు. సిల్వర్ జూబ్లీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. శ్రీనివాస్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ బాల కృష్ణయ్య శెట్టి, డాక్టర్ పి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటోమేటిక్ ఫిట్‌నెస్ పరీక్షలు

- కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద ప్రయివేట్ స్టేషన్
- రవాణా శాఖ కార్యాలయాల్లో ఎఫ్‌సీ సేవలు నిలుపుదల

కర్నూలు: రవాణా శాఖ పరిధిలో సామర్థ్య పరీక్షలు (ఫిట్‌నెస్ టెస్ట్) సులభతరం కానున్నాయి. జిల్లాలో భారీ వాహనాలు, రవాణా వాహనాలకు ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్ట్(ఏటీఎస్) స్టేషన్ వసుధ ఇండస్ట్రీస్ ఏజెన్సీ దక్కించుకుంది. కల్లూరు మండలం చిన్నటేకూరు వద్ద ఏర్పాటు చేశారు. జిల్లా పరిధిలో సుమారు లక్షకు పైగా రవాణా వాహనాలు ఉన్నాయి. ఇప్పటివరకు వాటికి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐ) ప్రత్యక్షంగా తనిఖీ చేసి ధ్రువపత్రాలను జారీ చేస్తున్నారు. ఇకపై ఆ విధానానికి స్వస్తి పలికి ఏటీఎస్ ద్వారా వాహన సామర్థ్య పరీక్షలు పూర్తిస్థాయిలో నిర్వహించి ధ్రువపత్రాలు జారీ చేయనున్నారు. ఇప్పటివరకు కర్నూలు ఉప రవాణా శాఖ కార్యాలయం, ఆదోని ప్రాంతీయ కార్యాలయంలో ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు స్వయంగా ఎంవీఐలే జారీ చేశారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వుల మేరకు నేటి నుంచి (16వ తేదీ) ఫిట్‌నెస్ సేవలు రవాణా శాఖ కార్యాలయాల్లో నిలిపివేశారు. నంద్యాల జిల్లాలో చాబోలు వద్ద ఈనెల మొదటి వారంలోనే ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌ను ప్రారంభించగా.. కర్నూలు జిల్లాలో చిన్నటేకూరు వద్ద శుక్రవారం నుంచి ఏటీఎస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఏటీఎస్ ద్వారా 54 రకాల పరీక్షలు చేస్తారు. ఇదిలాఉంటే ఉమ్మడి జిల్లాలో కేవలం రెండు కేంద్రాలే ఏర్పాటు చేయడం, మిగిలిన ప్రాంతాల వాసులు అక్కడికి వెళ్లాలంటే అవస్థలు తప్పేలా లేవు. ఆదోనికి చెందిన వాహనదారులు చిన్నటేకూరు వద్దకు, డోన్‌కు చెందిన వాహనదారులు చాబోలు కేంద్రానికి వెళ్లాలంటే సుమారు 60 నుంచి 80 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి ఉండటం గమనార్హం. ఇదే సమయంలో ముందస్తు సమాచారం లేకుండా రవాణా శాఖ కార్యాలయాల్లో ఫిట్‌నెస్ సేవలు నిలిపివేయడంతో రెండు రోజుల ముందే ఆన్‌లైన్‌లో స్లాట్ పొందిన గూడ్స్ వాహన యజమానులు అయోమయంలో పడ్డారు.



ఆటోమేటిక్ ఫిట్‌నెస్ టెస్ట్ స్టేషన్ (ఏటీఎస్)

బాబు మాట.. నీటి మూట!

- అమలు కాని సీఎం చంద్రబాబు హామీ
- న్యాయం చేయాలంటున్న శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగులు
- శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన 66 గ్రామాలు
- అప్పట్లో భూములు కోల్పోయిన 12 వేల కుటుంబాలు

హామీ ఇవ్వడం అధికారంలోకి వచ్చాక దానిని మరచిపోవడం సీఎం చంద్రబాబుకు అలవాటేనని పలువురు ఆరోపిస్తున్నారు. శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగులకు ఇచ్చిన వాగ్దానాలే ఇందుకు నిదర్శనంగా చూపుతున్నారు. శ్రీశైలం నీటిముంపు నిర్వాసితుల సమస్యను పరిష్కరిస్తానని 2003, 2016, 2019, 2024లో టీడీపీ అధినేత మాట ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. నాలుగు సార్లు హామీలు ఇచ్చినా.. ఇప్పటి వరకు ఉద్యోగాలు రాలేదని నీటిముంపు బాధితులు కన్నీటి పర్యంతం అవుతున్నారు.

నందికొట్కూరు: శ్రీశైలం వద్ద కృష్ణానదిపై జలాశయం నిర్మాణానికి 1963లో శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టు కింద సుమారు 12 వేల కుటుంబాలు సర్వం కోల్పోయాయి. మొత్తం 66 గ్రామాల్లో లక్ష ఎకరాల భూమి ముంపునకు గురైంది. 44 రెవెన్యూ గ్రామాలు, 22 మజరా గ్రామాలకు చెందిన ప్రజలు నిర్వాసితులయ్యారు. వీరు నాలుగు దశాబ్దాలుగా ఉద్యోగం కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. వీరి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. సాగు నీరు, విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంతో నిర్మించిన శ్రీశైలం ప్రాజెక్టుతో ఇరు తెలుగు రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు కలుగుతోంది. నిర్వాసితులు మాత్రం న్యాయం కోసం నేటికీ పోరాడాల్సి వస్తోంది.



సంగమేశ్వర పుణ్యక్షేత్రం వద్ద కనిపిస్తున్న శ్రీశైలం బ్యాక్ వాటర్(ఫైల్)

ఏం జరిగిందంటే..
శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగులు ఉద్యోగాల కోసం 1982లో ఉద్యమ బాటపట్టారు. అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు.. శ్రీశైలం ముంపు బాధిత ఇంటింటికీ ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా 1986లో జీఓ 98 జారీ అయ్యింది. దీంతో అప్పట్లో 1,200 మంది ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నారు. ఎన్టీఆర్ ఇచ్చిన జీవోను టీడీపీ అధినేత చంద్రబాబు తుంగలో తొక్కేశారు. ఉద్యోగాలు ఇస్తామని పలుమార్లు హామీ ఇచ్చినా అమలు చేయలేదు.

న్యాయం కోసం ఎదురు చూపు
శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు మొదటి జాబితాలో 965 మందిని అర్హులుగా ప్రకటించారు. 2012లో కేవలం 120 మందికి మాత్రమే తాత్కాలిక పద్ధతిలో లష్కర్ ఉద్యోగాలు ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం ఉన్న సమయంలో రెండో జాబితాను తయారు చేయించినా ఉద్యోగాలు ఇవ్వలేదు. దీంతో నీటిముంపు నిరుద్యోగులు మళ్లీ పోరాటం కొనసాగించారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూనే ఇప్పటికీ చాలా మంది పెళ్లిళ్లు కూడా చేసుకోలేదు. కొందరు అనారోగ్యాల కారణంగా మృతి చెందారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణానికి భూములిచ్చి 45 సంవత్సరాలు అవుతున్నా నిర్వాసితులకు ఉద్యోగం కలగానే మిగిలింది. ధర్నాలు, దీక్షలు చేసి నిర్వాసితులు అలసిపోయారు. న్యాయం చేయాలని కోరుతున్నారు.



ఉద్యోగాల కోసం శ్రీశైలం నీటిముంపు నిర్వాసితులు ఆందోళన చేస్తున్న దృశ్యం(ఫైల్)

హామీని ఇలా ‘నీరు’గార్చారు..
- ➡ శ్రీశైలం నీటిముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని 2003లో సీఎం హోదాలో నారా చంద్రబాబు నాయుడు హైదరాబాద్‌లో హామీ ఇచ్చారు.
- ➡ సీఎం హోదాలో 2016లో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం వద్ద జలహారతి కార్యక్రమంలో ఇదే హామీ ఇచ్చారు.
- ➡ సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా 2019లో నందికొట్కూరుకు వచ్చి నీటిముంపు నిరుద్యోగులకు న్యాయం చేస్తామని వాగ్దానం చేశారు.
- ➡ 2024లో జరిగిన ఎన్నికల్లో నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో టీడీపీ అధినేతగా చంద్రబాబు ప్రసంగించారు. శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా ఇచ్చిన హామీని అమలు చేయలేదు.
- ➡ నిర్వాసితులు గత ఏడాది అక్టోబర్ 28న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆరు నెలల దాటినా డిప్యూటీ సీఎం సమస్యకు మార్గం చూపించలేదు.

తలరాత మారలేదు



శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో 12 ఎకరాల భూమిని కోల్పోయాం. ఉద్యోగం వస్తుందనుకున్నా. రెండో జాబితాలో నా పేరు ఉన్నా ఇప్పటికీ ఉద్యోగం ఇవ్వలేదు. ఇచ్చిన హామీని అమలు చేయలేదు. మా తలరాత ఇప్పటికీ మారలేదు.

– బొల్లు ప్రసాద్, పెద్ద గుమ్మాడాపురం, కొత్తపల్లి మండలం

ఉద్యోగాలు ఇవ్వాలి



శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితులకు అన్యాయం జరిగిన విషయం అందరికీ తెలిసిందే. నీటి ముంపు బాధితులకు ఎన్టీఆర్ ఒక్క ఉద్యోగం ఇవ్వలేదు. టీడీపీ అధినేత చంద్రబాబు పట్టించుకోలేదు. ఇప్పటికైనా సీఎం స్పందించి నీటి ముంపు నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వాలి.

– నాగశేనారెడ్డి, నీటి ముంపు నిర్వాసితుల నిరుద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ

- నలుగురికి గాయాలు



ప్రమాదానికి కారణమైన ఆర్‌టీసీ బస్సు

ఓర్వకల్లు: కర్నూలు - చిత్తూరు జాతీయ రహదారిపై పూడిచెర్ల బస్సు స్టేజీ వద్ద గురువారం ఆర్టీసీ బస్సు, లారీ ఢీ కొనడంతో నలుగురికి గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్‌ఐ సునీల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న లారీకి ఆవుల మంద అడ్డు రావడంతో లారీ డ్రైవర్ తన లారీని అకస్మాత్తుగా స్లో చేయడంతో, వెనక వస్తున్న ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తూ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న పోలూరుకు చెందిన నిర్మల అనే వృద్ధురాలి తలకు రక్తగాయాలు కాగా, జోత్స్న, వసంతకుమారి, ధర్మతేజ స్వల్పంగా గాయపడ్డారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని స్థానిక సీహెచ్‌సీ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ఈ ఘటనపై ఇరు వాహనదారులు ఫిర్యాదు చేయకుండా, రాజీ కుదుర్చుకోవడంతో కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య



తలారి నాగరాజు (ఫైల్)

కోసిగి: తుంబిగనూరు గ్రామానికి చెందిన తలారా నాగరాజు (27) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామంలో చేపల చెరువులలో రోజు వారి కూలి పనులుకు వెళ్లి జీవనం సాగిస్తున్న యువకుడు కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. భార్య నాగమ్మ పుట్టినిల్లు ఆదోని మండలం జాలమంచి గ్రామం. ఆమె 15 రోజులుగా నాగమ్మ చెల్లెలు పెళ్లి ఉందని పుట్టినింటికి వెళ్లిపోయింది. బుధవారం రాత్రి కడుపు నొప్పి తాళలేక నాగరాజు జీవితంపై విరక్తి చెంది తుంగభద్ర నది కాల్వ ఒడ్డున రేకుల షెడ్‌వద్ద ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీస్‌లకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ హనుమంత రెడ్డి, ఏఎస్‌ఐ నాగరాజులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. మృతుడు తల్లి ఉచ్చీరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతినికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పిడుగు పాటుకు గొర్రెల కాపరి మృతి




మృతి చెందిన చంద్రశేఖర్

చాగలమర్రి: చిన్నబోధనం మజరా గ్రామమైన తిప్పన పల్లె గ్రామ సమీపంలో గురువారం తెల్లవారుజామున పిడుగుపాటుకు ఓ గొర్రెల కాపరి మృతి చెందాడు. వైఎస్సార్ జిల్లా తొండురు మండలం కోరవానిపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (29)తో పాటు మరో ఐదుగురు కలసి సుమారు వెయ్యికి పైగా గొర్రెలతో 15 రోజుల క్రితం తిప్పనపల్లెకు చేరుకున్నారు. గ్రామంలోని బీడు భూముల్లో జీవాలను మేపుతూ అక్కడే ఉంటున్నారు. చంద్రశేఖర్ వేప చెట్టు కింద నిద్రిస్తుండగా గురువారం తెల్లవారు జామున చెట్టుపై పిడుగు పడింది. ఆ శబ్దానికి చంద్రశేఖర్ గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందగా, అక్కడే ఉన్న మూడు మేకలు కూడా మృత్యువాత పడ్డాయి. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ షేక్ అబ్దుల్ నబి సంఘటనా స్థలానికి చేరుకుని గొర్రెల కాపరుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న చంద్రశేఖర్ మృతితో సంఘటన స్థలంలో తల్లి పద్మావతి, కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పడగ విప్పిన డెంగీ

- నాలుగు నెలల్లో వంద కేసులు
- కర్నూలు డివిజన్‌లోనే అధికంగా నమోదు
- కర్నూలులో 59, పత్తికొండలో 14, ఆదోనిలో 27 కేసులు నమోదు
- తూతూమంత్రంగా అవగాహన కార్యక్రమాలు
- మురికి కూపాలుగా గ్రామాలు, పట్టణాలు
- దోమల నియంత్రణ చర్యలు శూన్యం
- నేడు జాతీయ డెంగీ దినోత్సవం



దోమా...దోమా ఎందుకు కుట్టావ్ అంటే....నన్ను పుట్టనిస్తే కుట్టనా అందట. నిజమే కదా దోమ పుడితేనే కదా అది కుట్టేది. అదే పుట్టకుంటే కుట్టే అవకాశమే ఉండదు కదా. కానీ పేరుకే 'దోమ పుట్టకూడదు...దోమ కుట్టకూడదు' అనే నినాదంతో కొన్నేళ్లుగా అధికారులు హడావుడి చేస్తూ ప్రచారం చేస్తున్నారు. కానీ ఆచరణలో మాత్రం అది అమలు కావడం లేదు. దోమలు పుడుతున్నాయి...మనుషులను కుడుతూనే ఉన్నాయి. తద్వారా ప్రాణాంతకమైన మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోదకాలు వంటి వ్యాధులు సోకి మనుషుల ప్రాణాల మీదకు తెస్తున్నాయి. ఈ నెల 16వ తేదీన జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోనూ పారిశుధ్యం అధ్వానంగా ఉంది. మురుగుకాల్వలు నిండిపోవడంతో దోమలకు అవి ఆవాసంగా మారాయి. తరచూ వర్షాలు కురవడంతో ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలుస్తోంది. అందులో దోమలు గుడ్లు పెట్టి అవి లార్వాలుగా మారి దోమల ఉత్పత్తి పెరుగుతోంది. ప్రధానంగా డెంగీ కారక ఏడిస్ ఈజిప్టై దోమ దోసెడు నీళ్ల చాలు అందులో పెరుగుతుంది. ఈ కారణంగా ఇళ్లు, దుకాణాల పరిసరాల్లో వాడి పారేసిన కొబ్బరి బోండాలు, కొబ్బరి చిప్పలు, పాతటైర్లు, ఇతర వస్తువుల్లో నీరు నిల్వ ఉండి అందులో డెంగీ దోమలు పెరుగుతున్నాయి. ఎప్పటికప్పుడు మున్సిపల్, పంచాయతీ సిబ్బంది పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించకపోవడం, గత ప్రభుత్వం చేపట్టిన పారిశుధ్య కార్యక్రమాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడటంతో దోమల ఉత్పత్తి అధికమవుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 13వ తేదీ వరకు జిల్లాలో ఆదోని మండలంలో ఒకటి, పెద్దకడుబూరులో 2, మంత్రాలయంలో 2, కర్నూలులో 9, ఓర్వకల్‌లో 3, పత్తికొండలో 4, కల్లూరులో 5, గూడూరులో 4, ఎమ్మిగనూరులో 10, సి.బెళగల్‌లో 13, దేవనకొండలో 3, తుగ్గలిలో 2, క్రిష్ణగిరిలో 3, గోనెగండ్లలో 4, వెల్దుర్తిలో 3, ఆస్పరిలో 3, నందవరంలో 1, చిప్పగిరిలో 2, కోడుమూరులో 5, కౌతాళం మండలంలో ఒకటి, కర్నూలు అర్బన్‌లో 16, ఆదోని అర్బన్‌లో 1, ఎమ్మిగనూరు అర్బన్‌లో 4, గూడూరు అర్బన్‌లో 3 కేసులు నమోదయ్యాయి.

డెంగీ ఎలా వస్తుందంటే...!

ఆర్థో వైరస్ తరగతికి చెందిన నాలుగు రకాల డెంగీ వైరస్‌ల వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఇది మనిషి నుంచి మనిషికి ఏడిస్ ఈజిప్టై దోమల ద్వారా సంక్రమిస్తుంది. ఆడ ఏడిస్ ఈజిప్టై దోమకాటు ద్వారా ఈ వ్యాధి వస్తుంది. ఈ జాతి దోమ పైన నల్లని, తెల్లని చారలు ఉండటం వల్ల దీనిని టైగర్ దోమ అని కూడా పిలుస్తారు. ఈ దోమలు ఇంటిలోపల, ఆవరణలో ఉంటాయి. డెంగీ వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన దోమలోనే గాకుండా దోమ గుడ్లలో కూడా ఈ వైరస్ ఉంటుంది. కాబట్టి త్వరితగతిన ఎక్కువ మందికి ఈ వ్యాధి వ్యాపించే అవకాశం ఉంటుంది. ఈ దోమ మంచినీటి నిల్వలలో మాత్రమే గుడ్లు పెడుతుంది. ఈ వైరస్ వల్ల ఒకటి కంటే ఎక్కువసార్లు డెంగీ రావచ్చు. ఈ వ్యాధిని డెంగీ జ్వరం, డెంగీ హెమరేజ్ జ్వరం, డెంగీ షాక్ సింక్రోమ్‌గా విభజిస్తారు.

వ్యాధి బయటపడే కాలం

డెంగీ వైరస్ ఇన్‌ఫెక్ట్ అయిన దోమకాటు తర్వాత మూడు నుంచి 14 రోజుల్లో డెంగీ వ్యాధి రావచ్చు. ఈ వైరస్‌తో ఇన్‌ఫెక్ట్ అయిన తర్వాత సాధారణంగా 80 శాతం మందికి దానంతటదే తగ్గిపోతుంది. వీరికి ఎర్రటి దద్దుర్లు వచ్చిన సమయంలో రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గినా సాధారణ స్థితికి చేరుకుంటారు. మిగతా రెండు రకాలలో (డెంగీ హెమరేజ్, డెంగీ షాక్ సింక్రోమ్) రక్తంలో ఈ ప్లేట్‌లెట్లు బాగా తగ్గడం వల్ల వీరికి ఆసుపత్రిలో చికిత్స అవసరం అవుతుంది.

వ్యాధి నిర్ధారణ..

డెంగీ జ్వరం నిర్ధారించేందుకు మొదటి వారంలో ఎన్‌ఎస్1 ర్యాపిడ్ కిట్‌తో పరీక్షను అన్ని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో నిర్వహిస్తారు. రెండవ వారంలో వ్యాధి తీవ్రతను బట్టి ధ్రువీకరణ పరీక్ష 'మాక్ ఎలీసా' పరీక్షలు బోధనాసుపత్రులు, జిల్లా ఆసుపత్రుల్లో చేస్తారు. ఈ పరీక్షలో ధ్రువీకరించితేనే అది డెంగీగా నిర్ధారణ అవుతుంది.

వ్యాధి లక్షణాలు

- ఆకస్మికంగా తీవ్రమైన జ్వరం, తలనొప్పి
- విపరీతమైన కండరాలు, కీళ్లనొప్పులు
- కళ్లనొప్పులు, కంటి కదలిక తగ్గడం, నొప్పి
- ఒక్కొక్కసారి శరీరంలో ఎర్రటి దద్దుర్లు
- చిగుళ్ల నుంచి రక్తస్రావం
- అధిక దాహం, నోరు ఎండిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి

నివారణ చర్యలు

- ఇంటిలోపల, ఇంటి ఆవరణలో ఎక్కడా మూతలేకుండా కొద్దిగా నీళ్లు కూడా నిల్వ ఉండకూడదు
- ఇంట్లో నీరు నిల్వలు ఉన్న పాత్రలపై మూతలు పెట్టాలి
- వారానికి ఒకసారి అన్ని నీటి నిల్వలను పారబోసి, పాత్రలను శుభ్రంగా తుడిచి పెట్టుకోవాలి.
- నీటి గుంటలు, చెరువులు, బావులు మొదలైన వాటిలో ప్రభుత్వ యంత్రాంగంతో 'గంబూషియా' చేపలను వేయించుకోవాలి.
- ఇంటిలో లేదా ఆవరణలో దోమల నివారణ మొక్కలైన బంతి, పుదీనా పెంచుకోవాలి
- ఇళ్లు, ఆవరణలో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం శుభ్రపరచుకోవాలి.

డెంగీ నివారణకు చర్యలు

జిల్లా వ్యాప్తంగా డెంగీ నివారణ చర్యలు తీసుకుంటున్నాం. కేసు నమోదైన ఇంటి చుట్టుపక్కల 50 ఇళ్లల్లో పైరిత్రమ్ స్ప్రే చేస్తున్నాం. నీళ్లు నిలిచిన చోట యాంటి లార్వా చర్యలు తీసుకుంటున్నాం. దోమలు ఎక్కువగా ఉంటే మున్సిపల్, పంచాయతీ శాఖల సహకారంతో ఫాగింగ్ ఆపరేషన్ చేస్తున్నాం. వెయ్యి జనాభాలో ఇద్దరి కంటే ఎక్కువ పాజిటివ్ కేసులు వచ్చిన ప్రాంతంలో 45 రోజులకు ఒకసారి డీడీటీ స్ప్రే చేయిస్తున్నాం.

– నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

భళా .. బసవా!

- 8 గంటల్లో 12 ఎకరాలు దుక్కులు దున్నిన ఎద్దులు
- గ్రామంలో ఊరేగింపు



ఎద్దులను ఊరేగిస్తున్న దృశ్యం

కోసిగి: జంపాపురం గ్రామానికి చెందిన ఈశ్వర రెడ్డికి చెందిన ఎద్దులు 8 గంటల్లో 12 ఎకరాల పొలాన్ని దుక్కి దున్ని సత్తా చాటాయి. గురువారం ఈశ్వర రెడ్డి పొలంలో తెల్లవారుజామున 4 గంటలకు ఎద్దులతో దుక్కులు ప్రారంభించారు. మధ్యాహ్నం 12 గంటలోపే ఏకధాటి 12 ఎకరాలు దున్నాయి. చాలా తక్కువ సమయంలో పొలం దున్నడంతో గ్రామస్తులు ఎద్దులను పురవీధుల్లో ఊరేగించారు.

రూ.వంద కోట్ల స్త్రీ నిధి రుణాలు పంపిణీ

- డీఆర్‌డీఏ ఏజీఎం నాగప్రసాదు

శిరివెళ్ల: జిల్లాలో గత ఆర్థిక సంవత్సరంలో 15,725 మంది డ్వాక్రా మహిళలకు రూ.వంద కోట్ల స్త్రీ నిధి రుణాలను పంపిణీ చేశామని డీఆర్‌డీఏ స్త్రీ నిధి విభాగం ఏజీఎం నాగప్రసాదు తెలిపారు. గురువారం స్థానిక పొదుపు భవన్‌లో ఏర్పాటు చేసిన సీసీల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.125 కోట్ల రుణాలు ఇవ్వాలన్నది లక్ష్యం కాగా రూ.100 కోట్ల రుణాలు పంపిణీ చేశామన్నారు. అందులో శిరివెళ్ల మండలంలో రూ.5 కోట్ల రుణాల పంపిణీ జరిగిందన్నారు. రుణాలు వసూళ్లలో కోవెలకుంట్ల క్లస్టర్ వెనుకబడిపోయిందన్నారు. కొలిమిగుండ్ల, సంజామల, అవుకు, బనగానపల్లె మండలాలల్లో రూ.5 కోట్ల బకాయిలున్నాయన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.1,800 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. శిరివెళ్ల మండలంలో రూ.6 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యమన్నారు. అర్హులైన మహిళలు ఆయా సంఘాల తీర్మానాలతో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు 11 శాతం వడ్డీతో రుణం తీసుకోవచ్చన్నారు. రుణాలన్నీ గడువులోగా చెల్లించకపోతే తర్వాత రుణాలు మంజూరు కావన్నారు. సమావేశంలో ఏపీఎం రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

కూతురుకు భారం కాకూడదని..

- తండ్రి ఆత్మహత్య



సంఘటనా స్థలంలో మృతదేహం వద్ద విచారణ చేస్తున్న రైల్వే పోలీసులు

వెల్దుర్తి: అనారోగ్యం బారిన పడిన ఓ వ్యక్తి కుమార్తె, అల్లుడుకి భారం కాకూడదని ఆత్మహత్య చేసుకున్నాడు. వెల్దుర్తి రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బనగానపల్లె మండలం పలుకూరుకు చెందిన డి చిన్నబాబు(42) పాలీస్ బండల ఫ్యాక్టరీలు కూలీగా జీవించేవాడు. ఒక్కగానొక్క కుమార్తె అమ్రిన్‌ను వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన వ్యక్తితో వివాహమైంది. ఇటీవల చిన్నబాబు పక్షవాతంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. అప్పులు ఎక్కువై స్వగ్రామంలో ఉన్న ఒక్క ఇంటిని అమ్మి భార్యతో కలిసి కుమార్తె, అల్లుడు వద్దకు చేరుకున్నారు. అనారోగ్యంతో వారికి భారమవడం ఇష్టంలేని చిన్నబాబు బుధవారం రాత్రి బయటకు వచ్చి గురువారం తెల్లవారుజామున గ్రామ సమీపంలోని రైల్వే పట్టాలపై శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న కర్నూలు జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐలు ప్రేమ్‌కుమార్, రమేశ్‌లు సంఘటనాస్థలికి చేరుకుని విచారించారు. రాత్రి గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని, కర్నూలు ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన తలారి వేణు

మహానంది: నంద్యాల - గిద్దలూరు రహదారిలో గురువారం రాత్రి బోయిల కుంట్ల మెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. బనగానపల్లె మండలం బీరవోలు గ్రామానికి తలారి వేణు(18), మధుకృష్ణ బైక్‌పై గాజులపల్లెలో బంధువుల ఇంట్లో జరుగుతున్న తిరుగు పెళ్లికి బయలుదేరారు. ఈ క్రమంలో బోయిలకుంట్ల మెట్ట వద్ద గంగవరం గ్రామానికి చెందిన తెలుగు రమణ, బాలు మరో బైక్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తూ రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బీరవోలు గ్రామానికి చెందిన తలారి వేణు మృతి చెందగా రమణ, బాలు, మధుకృష్ణ గాయపడ్డారు. రోడ్ సేఫ్టీ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాద విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ రామ్మోహన్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి, కుటుంబీకులకు సమాచారం అందించారు.

శ్రీశైలంలో మద్యం పట్టివేత

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం పరిధిలోని టోల్ గేట్ వద్ద సాధారణ తనిఖీలలో భాగంగా అక్రమంగా తరలిస్తున్న మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం శ్రీశైలం టోల్ గేట్ వద్ద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన కొర్ర మోతి లాల్ అనే వ్యక్తి సున్నిపెంట నుంచి ఆర్టీసీ బస్సులో 50 మద్యం సీసాలు తీసుకెళ్తూ పట్టుబడ్డాడు. మద్యం స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రసాదరావు తెలిపారు.

అదృశ్యం కేసులో ఆద్యంతం మలుపులు

- గత నెల 26వ తేదీన అదృశ్యమైన వ్యక్తి హత్య?
- అనుమానితులను విచారిస్తున్న పోలీసులు



గువ్వల రాజు(ఫైల్)

సాక్షి, టాస్క్ ఫోర్స్: మండల కేంద్రమైన గడివేములకు చెందిన గొర్రెల కాపరి గువ్వల రాజు అదృశ్యం కేసు ఆద్యంతం మలుపులు తిరుగుతోంది. తన తమ్ముడు రాజు కనిపిచడం లేదని అన్న జనార్దన్ గత నెల 26వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసుల దర్యాప్తులో కీలక ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. విచారణ చేస్తుండగా గ్రామంలోని ఓ రైతు మొక్క జొన్న పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆనవాళ్లు లభించడంతో ఈనెల 10వ తేదీన అనుమానాస్పద మృతి కింద మరో కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. గువ్వల రాజును కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేసి, శవాన్ని మాయం చేసే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. గొర్రెల కాపరి రాజు కొన్నేళ్లుగా ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఇదే క్రమంలో భార్యాపిల్లలు కూడా అతడిని వదిలేశారు. దీంతో అక్కడక్కడా గొర్రెల కాపరిగా వెళ్తూ వచ్చే కూలీ డబ్బుతో జీవించేవాడు. అయితే మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కొంత మంది యువకులు కలిసి రాజును హత్య చేసినట్లు పోలీసుల విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. దారుణంగా హత్య చేసి గుర్తు పట్టకుండా మృతదేహంపై యాసిడ్, పెట్రోల్ పోసి దహనం చేసినట్లు సమాచారం. ఆ తర్వాత అస్తిపంజరంలో చిన్న ఎముకలను విసిరేసి పెద్ద ఎముకలను పిండి చేసి పొలంలో పడేసినట్లు తెలిసింది. అనుమానితులను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. హత్యకు పాల్పడిన స్థలానికి నిందితులను తీసుకెళ్లి విచారణ చేశారు. నిందితులను రెండు రోజుల్లో అరెస్టు చూపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కర్నూలు రూరల్ సీఐపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

కర్నూలు: కర్నూలు రూరల్ తాలూకా సీఐ చంద్రబాబు తనను మహిళా అని కూడా చూడకుండా బూతులు తిడుతూ చేయి చేసుకున్నాడని ఉలిందకొండ గ్రామానికి చెందిన మహిళా రైతు వెంకటేశ్వరమ్మ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన నాగన్న, వెంకటేశ్వరమ్మ దంపతులకు ఉలిందకొండలో 12.84 ఎకరాల భూమి ఉంది. అయితే ఆర్‌ఎస్‌ఆర్‌లో చుక్కలు ఉన్నాయనే కారణంతో నిషేధిత భూముల జాబితాలో పెట్టారు. ఈ భూమి కోసం తన కుటుంబాన్ని చంపాలని ప్రయత్నిస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి కేజే రెడ్డి, ఉలిందకొండ ఎస్‌ఐ, తాలూకా సీఐ నుంచి రక్షణ కల్పించి తమ కుటుంబం స్వగ్రామంలో నివాసముండే విధంగా హక్కులు కల్పించాలని గురువారం మానవ హక్కుల కమిషన్‌కు పంపిన వినతిపత్రంలో కోరారు. ఉలిందకొండ ఎస్‌ఐ తనను, తన కుటుంబాన్ని చిత్రహింసలు పెట్టిన విషయం పేపర్‌లో వచ్చినందువల్ల ఈనెల 11వ తేదీన ఒకసారి, 13వ తేదీన మరోసారి కర్నూలులోని సర్కిల్ కార్యాలయానికి పిలిపించి బూతులు తిడుతూ చేయి చేసుకుని సీఐ బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. 'పోలీసులపై పేపర్‌లో రాయించేంత ధైర్యం నీకెక్కడి నుంచి వచ్చింది.. ఎవరి సపోర్టుతో ఇంతకు తెగించారు... తప్పుడు కేసులు బనాయించి శాశ్వతంగా పనికి రాకుండా చేస్తా'నంటూ సీఐ బెదిరిస్తున్నాడని వినతిపత్రంలో పేర్కొన్నారు. మహిళ అని కూడా చూడకుండా కాలితో కడుపు మీద తన్నాడని కమిషన్‌కు పంపిన వినతిపత్రంలో ఫిర్యాదు చేశారు. తనపై దుర్భాషలాడి దాడికి పాల్పడిన సీఐపై చర్యలు తీసుకోవాలని ఆమె కమిషన్‌కు పంపిన లేఖలో విన్నవించారు.

ఉచితాన్ని తుంగలో తొక్కి!

- తుంగభద్ర నదిలో టీడీపీ నాయకుల అక్రమ తవ్వకాలు
- ప్రాంతాలుగా పంచుకుని అడ్డగోలుగా తరలింపు
- విభేదాలు రావడంతో పంచాయితీ చేసిన టీడీపీ నేత
- కలిసి దోపిడీ చేయాలని సలహా!



ట్రాక్టర్లలో తరలిస్తుంటే గొడవ పడుతున్న తెలుగు తమ్ముళ్లు

కర్నూలు(టౌన్): అధికారంలోకి వచ్చాక ధనార్జనే ధ్యేయంగా టీడీపీ నాయకులు పెచ్చుమీరిపోతున్నారు. సహజ వనరులను యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు. కర్నూలు శివారులోని తుంగభద్ర నదిలో ఇసుక పేదలకు అందకుండా ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. ప్రాంతాలు వారీగా దందా సాగిస్తున్నారు. ఈ విషయంలో ఇటీవల గొడవలు జరగడంతో టీడీపీ నేత పంచాయతీ చేసి కలసి దోపిడీ చేయాలని సలహా ఇచ్చినట్లు సమాచారం.

దోపిడీ ఇలా...

ప్రజలకు ఉచిత ఇసుక ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అందుకు విరుద్ధంగా టీడీపీ నాయకులు ఇసుక దోపిడీ చేస్తున్నారు. కర్నూలు నగర శివారు ప్రాంతాల్లో రీచ్‌లు లేకున్నా తుంగభద్ర నదిలో నిత్యం ఇసుక దందా సాగుతోంది. ఇంటి నిర్మాణాల కోసం ఒంటెద్దు బండ్లలో ఇసుకను తీసుకుపోవచ్చు అంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా.. అమలుకు మాత్రం నోచుకోవడం లేదు. కర్నూలు నగర శివారులోని తుంగభద్ర పరిసర ప్రాంతాల నుంచి ప్రతి రోజూ పగలు, రాత్రి అన్న తేడా లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ. 3 వేలకు అమ్ముకుంటున్నారు. రీచ్‌ల నుంచి మాత్రమే ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలించాల్సి ఉంది. అయితే తుంగభద్ర నదిలో రీచ్‌లు లేకున్నా ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు.

అడ్డుకుని.. హంగామా సృష్టించి

తుంగభద్ర ఇసుకను అక్రమంగా తరలించడంలో కర్నూలు మండలానికి చెందిన టీడీపీ నేత అనుచరులు బృందంగా ఏర్పడ్డారు. అలాగే మంత్రి పేరు చెప్పి కార్పొరేటర్ కుటుంబం సభ్యులు సైతం ఇసుకను తరలిస్తున్నట్లు విమర్శలు ఉన్నారు. ఇసుక దోపిడీకి వీరు ప్రాంతాలను ఏర్పచుకున్నారు. ఇటీవల మంత్రి పేరు చెప్పి సంకల్‌బాగ్, పాత తుంగభద్ర పంపింగ్ హౌస్ వద్ద ఇసుకను తరలిస్తుండగా కర్నూలు మండల టీడీపీ నేత అనుచరులుగా ఉన్న వారు అడ్డుకున్నారు. ఇసుక ట్రాక్టర్‌కు అడ్డంగా పడుకొని నానా హంగామా సృష్టించారు. 'తమ ప్రాంతంలో ఇసుకను ఎలా తరలిస్తున్నారు' అంటూ గొడవకు దిగారు.



ఇసుక ట్రాక్టర్‌కు అడ్డంగా పడుకున్న కార్పొరేటర్ కుటుంబ సభ్యులు

టీడీపీ నేత పంచాయితీ

కర్నూలు నగర శివారులోని తుంగభద్ర నదిలో ఇసుక తరలించే విషయంలో జరుగుతున్న గొడవలకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు టీడీపీ నేత పంచాయతీ చేశారు. ఇరు వర్గాల వారితో మాట్లాడారు. ఈ పంచాయితీలో ' ఇసుక మనది.. కలసి పంచుకుందాం.. గొడవలు వద్దు.. అందరం పంచుకుందాం' అన్న అభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. 'మీ ప్రాంతంలోకి మా వారు.. వారి ప్రాంతంలోకి మీరు రాకూడదు' అంటూ టీడీపీ నేత ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

ఇదీ దుస్థితి..

- తుంగభద్ర నది నుంచి ప్రైవేటు ట్రాక్టర్ల అసోసియేషన్ వారు సైతం టీడీపీ నేతల నాయకుల పేర్లు చెప్పి ఇసుకను తరలిస్తున్నారు.
- ఒంటెద్దు బండ్లకు ఉచితంగా ఇసుకను తీసుకునే పోయే అవకాశం ప్రభుత్వం కల్పించినా పట్టించుకునే నాథుడు లేడు.
- ఇసుక దందాపై అధికారులు తమకేం సంబంధం లేదని వ్యవహరిస్తున్నారు.

పాలకవర్గాల పదవీ కాలం పొడిగింపు

కర్నూలు (అగ్రికల్చర్): జిల్లాలోని రెండు రైతు ఉత్పత్తిదారుల సంఘాల అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిల పదవీ కాలాన్ని ఆరు నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గోనెగండ్లకు చెందిన ప్రగతి ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌కు సహకార శాఖ సీనియర్ ఆడిటర్ అశోక్ కుమార్, హొళగుంద మండలం హెచ్.కొట్టాల గ్రామానికి చెందిన కృషి సాధన అగ్రికల్చర్ అండ్ అలైడ్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కో–ఆపరేటివ్ సొసైటీకి సీనియర్ ఆడిటర్ రామరాజు అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. వీరి పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో ఆరు నెలల పాటు పొడిగిస్తూ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ జీవో ఆర్‌టీ నెంబర్లు 266, 267ను జారీ చేశారు.